## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలియజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్:(040) 2475132, 247456,24745626

# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
VOLUME: 16 ISSUE:152

తెలుగు దినపత్రిక


## డివిజనల్ బెంచ్ కు సర్కార్..

హైదరాబాద్, హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకు సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, వేల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, ఇటీవల లోతుకుంటలో భూకబ్జా యత్నాన్ని కూడా అడ్డుకుందని తెలిపారు. ఆక్రమణల తొలగింపుతో పాటు ఇప్పటికే 6 చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార కేసులన్నీ భూకబ్జాదారులు వేసినవేనని ఆరోపిస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని.. ఆ కేసులన్నింటినీ చట్టపరంగానే ఎదుర్కొంటానని ఆయన అన్నారు. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.


నల్లగొండ సంపుటి: 16 సంచిక :177 ఎడిటర్ : సయ్యద్ పాష తేది: గురువారం 30-07-2026 పేజీలు:4 వెల: 1.00


# రాహుల్ గాంధీ గర్జన... 'తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఢిల్లీ వీధుల్లోకి వచ్చారు!'

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న విద్యా వ్యవస్థ సంస్కరణలపై పార్లమెంట్‌లో బుధవారం నాడు అత్యంత కీలకమైన చర్చ జరిగింది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అక్రమాలు, నిరసనకారులపై పోలీసుల దమనకాండ వంటి సంక్షోభాల నేపథ్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు' (Public Examinations Amendment Bill 2026) చర్చలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పాల్గొని తన వాణిని వినిపించారు. విద్యార్థులు పిడికిలి బిగించి, జాతీయ జెండాలను చేతబూని ఢిల్లీ వీధుల్లోకి రావడానికి దారితీసిన అసలు కారణాలను ఆయన సున్నితంగా, అదే సమయంలో అత్యంత ప్రభావవంతంగా సభ ముందు ఉంచారు.

తీవ్ర వేదన తర్వాతే రోడ్డెక్కిన విద్యార్థి లోకం : లోక్‌సభలో విద్యా వ్యవస్థ, విద్యార్థుల సమస్యలపై మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించినందుకు రాహుల్‌గాంధీ తొలుత స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీల వల్ల యువత అనుభవిస్తున్న మానసిక నరకాన్ని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

వ్యవస్థపై అపనమ్మకం: "మన దేశంలో విద్యా వ్యవస్థ విద్యార్థులకు అండగా నిలవాల్సింది పోయి, వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. తీవ్ర వేదన, అంతులేని నిరాశకు గురైన తర్వాతే విద్యార్థులు ఢిల్లీ వేదికగా శాంతియుత నిరసనలకు దిగారు. గుండెల నిండా ఆవేదన గూడుకట్టుకుంటే తప్ప ఎవరూ అలా రోడ్డుపైకి రారు" అని రాహుల్ వ్యాఖ్యానించారు.



విద్యార్థుల నుంచే నేరుగా సలహాలు: తాను కేవలం రాజకీయ నాయకుడిలా మాట్లాడటం లేదని, బాధిత విద్యార్థులను స్వయంగా కలిసి, వారి కష్టాలను, వారు సూచించిన పరిష్కారాలను అర్థం చేసుకున్నట్లు చెప్పారు. ఆందోళన చేస్తున్న కొందరు విద్యార్థులతో తాను వ్యక్తిగతంగా మాట్లాడానని, విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు వారు కొన్ని విలువైన సూచనలు చేశారని, వాటినే తాను సభ ముందు ఉంచుతున్నానని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సెంటిమెంట్‌ను గౌరవించాలి : యువత జరుపుతున్న ఈ ఆందోళన వెనుక ఉన్న బాధను, వారి న్యాయమైన డిమాండ్లను దేశ ప్రజలందరూ అర్థం చేసుకున్నారని రాహుల్ వివరించారు.

# గురు పౌర్ణమి.. పలు ఆలయాల్లో తలసాని ప్రత్యేక పూజలు..



సికింద్రాబాద్ : గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం పలు సాయిబాబా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మారావు నగలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ సాయికుమార్ బాబా ఎమ్మెల్యేను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు అంబులెన్స్ సురేష్, రమణ, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యూ బోయగూడ కమాన్ వద్ద ఉన్న సా యిబాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మోండా డివిజన్ లోని పాలికా బజార్‌లో ఉన్న సాయిబాబా దేవాలయంలోనూ ఎమ్మెల్యే తలసాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు గందే నాగులు, కొండాపురం మహేష్ యాదవ్, ఆనంద్ పాటిల్, సత్యనారాయణ, అమర్, శ్రీనాథ్, జయరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రావ్, సభ్యులు శంకర్ రావు, హన్మంతరావు యాదవ్, శ్రీనివాస్, జనార్దన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# కొండగట్టు గిరి ప్రదక్షిణలో మంత్రులు పొన్నం,అడ్లూరి



కొండగట్టు:గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. బుధవారం తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా గిరి ప్రదక్షిణలలో మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆంజనేయస్వామి చూడాలని కోరుకున్నట్లు తెలిపారు.

# ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం

హైదరాబాద్,:తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగి ఉన్న పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన శుభవార్తను అందించాయి. ఎల్నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో తలెత్తే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టారు. ఆగస్టు, సెప్టెంబర్ అలాగే అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి లబ్ధిదారులకు అందజేయనున్నారు. సాధారణంగా ప్రతి నెలా ఒక్కో వ్యక్తికి ఆరు కేజీల బియ్యం ఇస్తుండగా, ఇప్పుడు ఈ మూడు నెలలకు కలిపి మొత్తం పద్దెనిమిది కేజీల బియ్యాన్ని ఒకే సారి ఇవ్వనున్నారు. ఉదాహరణకు నలుగురు సభ్యులు ఉన్న కుటుంబానికి డెబ్బై రెండు కేజీల బియ్యం ఉచితంగా లభిస్తాయి. గతంలో కూడా వేసవి కాలంలో ఇదే పద్ధతిలో ముందుగానే బియ్యం పంపిణీ చేయగా, ఇప్పుడు మరోసారి ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా పేద కుటుంబాలకు పెద్ద ఊరట లభించినట్లయింది.

మూడు నెలల కోటా పంపిణీ విధానం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పంపిణీ ఏర్పాట్లను వేగవంతం చేశారు. రేషన్ డీలర్లకు ఇప్పటికే బియ్యం సరఫరా ప్రారంభం కాగా, లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఒకేసారి భారీ మొత్తంలో మూడు నెలల సరుకులు వస్తుండడంతో రేషన్ డీలర్లు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చాలా దుకాణాల్లో పెద్ద ఎత్తున బియ్యాన్ని నిల్వ చేయడానికి తగినంత స్థలం లేకపోవడం మరియు ఈ పాస్ యంత్రాలలో తరచూ నెట్‌వర్క్ సమస్యలు తలెత్తుతుండడం ప్రధాన సమస్యలుగా మారాయి. లబ్ధిదారుల వేలిముద్రలు సకాలంలో పడకపోవడం వల్ల



ఒక్కో వ్యక్తికి సమయం ఎక్కువై క్యూ లైన్లు పెరిగే అవకాశం ఉందని డీల ర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ నిరుపేదలకు ఆహార భద్రత కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది.

భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు ముందస్తు ఆహార భద్రత చర్యలు ప్రకృతి వైపరీత్యాలు మరియు కరువు ఛాయలు కమ్ముకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుంది. ఏ సమయంలోనైనా ఆహార కొరత ఏర్పడకుండా ముందస్తుగా మూడు నెలల కోటాను చేతికి అందించడం ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా మరియు మానసికంగా ధైర్యంగా ఉండగలరు. పౌరసరఫరాల శాఖ ఈ ప్రక్రియను ఎలాంటి అంతరాయాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించింది. తూకంలో తేడాలు రాకుండా మరియు ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి పూర్తి స్థాయి బియ్యం అందేలా పర్యవేక్షణ కొనసాగుతోంది.

# హైడ్రా నిర్ణయాలన్నీ సీఎం పరిధిలోనే

హైదరాబాద్, హైదరాబాద్‌లో హైడ్రా చేపడుతున్న చర్యలపై నెలకొన్న రాజకీయ చర్చల నేపథ్యంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా వ్యవహారం పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోర్ట్‌ఫోలియో పరిధిలోనే ఉంటుందని, దానికి సంబంధించిన నిర్ణయాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన టీపీసీసీ సమన్వయ కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, హైడ్రాకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు, కార్యాచరణపై వివరణ కావాలంటే ముఖ్యమంత్రినే అడగాలని సూచించారు. హైడ్రా పనితీరుపై ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకెళ్తోందని, తన శాఖకు ఆ వ్యవహారంతో సంబంధం లేదని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్ విమర్శలు నిరాధారం

హైడ్రా నిర్వహణపై ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ఉత్తమ్ కుమార్ రెడ్డి కొట్టిపారేశారు. ప్రభుత్వ నిర్ణయాలను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పాలనాపరమైన అంశాలపై ప్రజల్లో గందరగోళం సృష్టించడం సరికాదని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో కాంగ్రెస్ కీలక సమావేశం

ఢిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడంతో పాటు రానున్న శాసనమండలి (ఎంఎల్‌సీ)



ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడంపై అధిష్ఠానం దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు.

ఐక్యతతో ముందుకు సాగాలని సూచన

పార్టీలోని నాయకులంతా విభేదాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఏఐసీసీ నాయకత్వం సూచించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో దృష్టి సారించినట్లు చెప్పారు.

# తెలంగాణకు హై అలర్ట్.. మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు



హైదరాబాద్,వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గడిచిన 20 గంటలుగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం ఈ తీవ్ర వాయుగుండం తెలంగాణ వైపు దూసుకొస్తుంది. ఈ ప్రభావంతో రాష్ట్రంలో రాగల 36 గంటల్లో అత్యంత భారీ నుంచి తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా జూలై 29, 30 తేదీల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పరిస్థితులు అత్యంత తీవ్రంగా మారనున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 300 మిమీ నుంచి 450 మిమీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల భారీగా వరదలు ముంచెత్తుతాయని వెదర్ మ్యాన్ హెచ్చరించారు. పింక్ అలర్ట్‌లో భాగంగా అత్యంత ప్రమాదకర వర్షపాతం నమోదయ్యే జిల్లాల ప్రజలను తక్షణమే అప్రమత్తం చేయాలని, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక జిల్లాల పరిపాలన యంత్రాంగాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే మధ్య, పశ్చిమ, తూర్పు తెలంగాణ పరిధిలో రెడ్ అలర్ట్ జారీ అయింది. దీంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు రోజు మొత్తం ముసురు వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు నాగర్‌కర్నూల్, వనపర్తి, నల్గొండ వంటి దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం స్వల్ప వర్షపాతం మాత్రమే నమోదు కానుందని అధికారులు నివేదికలో స్పష్టం చేశారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాక సూచించారు.

# రేవంత్,కేటీఆర్,బండి సంజయ్.. నేరెళ్ల పాపం.. అందరిది..



హైదరాబాద్,అప్పట్లో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో దారుణం జరిగింది. ఇసుక అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. దీనిని ప్రశ్నించిన దళితుల మీద దారుణానికి పాల్పడ్డారు. ఇందులో కొంతమంది చనిపోయారు కూడా. పోలీసులు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారు. వాస్తవానికి నాడు భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉంది కాబట్టి ఈ ఘటనను వెలుగులోకి రాకుండా ప్రయత్నం చేసింది. కానీ సోషల్ మీడియా బలంగా ఉండడంతో నేరెళ్ల ఘటన సభ్య సమాజానికి తెలిసింది. ఈ కేసులో సూత్రధారులను.. పాత్రధారులపై నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. దీనికి తోడు 2023 ఎన్నికల్లో ఎన్నికల ప్రచార సమయంలో నేరెళ్ల ఘటనను పదేపదే రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఎన్నికల ప్రచారంలో దీనిని ఉపయోగించుకున్నారు. అధికారులకు వచ్చిన తర్వాత నేరెళ్ల బాధితులకు న్యాయం చేసే విధంగా చూస్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు ఎటువంటి యాక్షన్ తీసుకోలేదు. సిరిసిల్ల జిల్లా పరిధిలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఉంటుంది. బండి సంజయ్ నాడు నేరెళ్ల బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ ఎస్సీ కమిషన్ కూడా ఈ గ్రామాన్ని సందర్శించింది. బాధితుల నుంచి వివరాలు సేకరించింది. కానీ ఇంతవరకు ఈ ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోలేదు. ఇకపై చర్యలు తీసుకుంటారో లేదో కూడా తెలియదు. సరిగా ఇదే విషయాన్ని టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రస్తావించారు. నేరెళ్ల ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈ నేపథ్యంలో నాడు మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్.. నేడు ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్ ని ఏకకాలంలో ఆమె ప్రశ్నించారు. ధన దాహం కోసం నేరెళ్ల పేదల ప్రాణాలతో పెద్దలు ఆడుకున్నారని ఆమె ఆరోపించారు. ఆమె చేసిన ప్రతి ఆరోపణ కూడా నాటి నేరెళ్ల బాధితుల కన్నీటికి సాక్షంగా కనిపిస్తోంది. కవిత లేవనెత్తిన అంశాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుందా.. కేటీఆర్ మీద చర్యలు తీసుకునే అంశాన్ని అవకాశం గా వాడుకుంటుందా.. బండి సంజయ్ ని ఇరుకున పెట్టే అంశాన్ని సానుకూలంగా మార్చుకుంటుందా.. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# సభలో దూషణల పర్వం.. రాహుల్ 'భాష'పై కిరణ్ రిజిజు ఆగ్రహం!

న్యూఢిల్లీ, దేశంలో పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు' పార్లమెంట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, విద్యార్థుల భవిష్యత్తును సరిదిద్దేందుకు ఉద్దేశించిన ఈ బిల్లుపై లోక్‌సభలో జరగాల్సిన చర్చ కాస్తా వ్యక్తిగత దూషణలు, రాజకీయ విమర్శల యుద్ధంగా మారిపోయింది. ముఖ్యంగా ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సభలో వాడుతున్న భాషపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లును వదిలేసి రాజకీయం చేస్తున్నారు: కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ధ్వజం : బుధవారం పార్లమెంట్ సముదాయం వెలుపల కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026' పై జరుగుతున్న చర్చను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే పక్కదారి పట్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. బిల్లు పరిధి దాటి ప్రసంగాలు: "చర్చలో భాగంగా మంగళవారం ప్రతిపక్ష ఎంపీలు చేసిన ప్రసంగాలను పరిశీలిస్తే, వారు బిల్లులోని అంశాలపై కనీసం మాట్లాడలేదు. చివరకు ప్రియాంకా గాంధీ సైతం బిల్లుకు ఏమాత్రం సంబంధం లేని అంశాలపైనే సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రతిపక్షాలు కేవలం




తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికే ప్రయత్నిస్తున్నాయి" అని రిజిజు విమర్శించారు. ప్రజాస్వామ్య విరుద్ధమైన భాష: పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ అభ్యంతరకర, దూషణలతో కూడిన భాషను వాడుతున్నారని రిజిజు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమే అయినా, సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిపక్ష నేతపై ఉంటుందని గుర్తుచేశారు. కనీసం ఐదు నిమిషాలైనా బిల్లుపై మాట్లాడండి: రాహుల్‌కు సవాల్ : ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కిరణ్ రిజిజు ఒక బహిరంగ సవాల్ విసిరారు.

